

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, సీఐ తుమ్మ గోపి

# తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్..

- ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్
- 8 లక్షల విలువైన బంగారం ఆభరణాలు స్వాధీనం
- వరంగల్ ఏసీపీ నందిరాం వెల్లడి

వరంగల్ చౌరస్తా, మే 27: ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనం చేసిన కేసులో ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను మట్టెవాడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ నిందితుల వివరాలు వెల్లడించారు. ఈ నెల 11న కొత్తవాడ శాంతినగర్ ప్రాంతంలో తాళం వేసి ఉన్న భయ్యాస్వామి ఇంట్లో 9 తులాల బంగారు ఆభరణాలతోపాటు వెయ్యి రూపాయల నగదు చోరీకి గురైంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలంలో దొరికిన వేలిముద్రలు, సాక్ష్యాల ఆధారంగా విచాణ చేపట్టారు. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాకు చెంది ఉండి మధ్యప్రదేశ్ రాష్ట్రం బేతుల్ జిల్లాలో నివాసముంటున్న వెంకటిరామ గోద్మారే(40), మహారాష్ట్ర యావత్మాల్ జిల్లాకు చెందిన షెరాలీ సయ్యద్ మోతీ(రహీం) (24) దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. సాంకేతికత ఆధారంగా నిందితుల జాడను తెలుసుకున్న పోలీసులు.. వారిని అరెస్ట్ చేసి, సుమారు రూ. 8.10 లక్షల విలువైన 9 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరికి క్రిమినల్ హిస్టరీ ఉంది. జల్సాల కోసం వెంకటిరామ గోద్మారే 2008 నుంచి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇతడిపై తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 20 కేసులు నమోదయ్యాయి. షెరాలీ సయ్యద్ మోతీ(రహీం) 2019 నుంచి సుపారీ మర్డర్స్ చేయడాన్ని వృత్తిగా ఎంచుకొని, రెండు హత్య కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. మహారాష్ట్ర అమరావతి జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో ఇరువురికి పరిచయం ఏర్పడింది. నాటి నుంచి ఇద్దరు కలిసి రైలు ప్రయాణాలు చేస్తూ ప్రధాన రైల్వే స్టేషన్లలో దిగి, స్టేషన్‌కు దగ్గర ఉన్న ఏరియాల్లో తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. తక్కువ సమయంలోనే ఈ కేసు ఛేదించిన ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, విచారణలో నైపుణ్యం ప్రదర్శించిన ఎస్సై నవీన్‌కుమార్, టీం సభ్యులు హరికాంత్, మీర్ అహ్మద్ అలీ, రాజేశ్, మహ్మద్ సల్మాన్ పాషా, నగేశ్‌రెడ్డి, ప్రవీణ్‌ను ఆయన అభినందించారు.



చెన్నారావుపేటలోని ఓ రైస్ మిల్లు వద్ద ధాన్యం దిగుమతి కోసం వేచి ఉన్న ట్రాక్టర్లు

# వడ్లు తీసుకోండి సారూ..

- అన్నదాతల వేడుకోలు
- తడిసిన ధాన్యం లోడ్‌లతో మిల్లు వద్ద క్యూ

చెన్నారావుపేట, మే 27: 'మా వడ్లు ముందుగా తీసుకోండి సారూ.. వడ్లు బాగా ఎండినై కొంత కట్టింగ్ పెట్టినా సరే.. మా ధాన్యం తీసుకోండి సారూ.. అంటూ అన్నదాతలు దీనంగా అభ్యర్థిస్తున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా రైతుల దీనస్థితి ఇలా ఉంది. యాసంగి పంట బాగా వచ్చింది. సన్న వడ్లకు బోనస్‌తో కలిపి మంచి రాబడి వస్తుందని ఎంతో ధీమా వ్యక్తం చేసిన రైతులు.. నేడు ట్రాక్టర్లలో వందల బస్తాలు నింపుకొని వడ్ల శాంపిళ్లతో కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద అధికారులు, మిల్లర్లను బతిమిలాడుకుంటున్నారు. పంట బాగా పండిందని సంబురపడిన రైతులను వర్షం వెంటాడుతూ కన్నీరు పెట్టిస్తుంటే.. తడిసిన ధాన్యాన్ని తీసుకునేది లేదని, బాయిల్డ్ మిల్లులకు తీసుకెళ్లమని లేదా కట్టింగ్ తప్పదని మిల్లర్లు కొర్రీలు పెడుతుండడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. మండలవ్యాప్తంగా ఒక్కటే బాయిల్డ్ రైస్ మిల్లు ఉండడంతో రైతులు ట్రాక్టర్ల నిండా ధాన్యం బస్తాలు తీసుకొచ్చి దిగుమతి కోసం వేచి ఉంటున్నారు. అధికారులు, నాయకులు రైతుల గోసను గమనించి మరి కొన్ని బాయిల్డ్ రైస్ మిల్లులు కేటాయించి త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, మే 27: వరంగల్ గోపాలస్వామిగుడి ప్రాంతంలోని ఎంజీఎం వొకేషనల్ జూనియర్ కళాశాలలో పారామెడికల్ కోర్సులు ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, సీపీఎం, ఈటీ, డీఎంపీహెచ్‌ఏ(ఎం), డీఎంఎల్‌టీ, డీవోఏ, డీఆర్‌జీఏ, ఓటీలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జడల ప్రదీప్ ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9059729000, 7989085534 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

### ఫీడర్ కెనాల్ పూడ్చివేత

సంగెం, మే 27: ఉపాధిహామీ పథకంలో తీసిన ఫీడర్ కెనాల్‌ను ట్రాక్టర్‌తో పూడ్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శి కోరారు. ఈజీఎస్ పథకంలో వెంకటాపురంలోని కరుణాపురం నుంచి పోశాల అశోక్ ఇంటి వరకు కొత్త ఫీడర్ కెనాల్ పనులు చేశారు. అదే గ్రామానికి చెందిన న్యాల శ్రీనివాస్, న్యాల రాజు, న్యాల అశోక్ ఈ నెల 24న ట్రాక్టర్‌తో పూడ్చివేశారు. ఈ మేరకు కార్యదర్శి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నరేశ్‌కు ఫిర్యాదు చేశారు.

### గుండెపోటుతో ఉపాధి కూలి మృతి

సంగెం, మే 27: గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన మెట్టుపెల్లి చేరాలు(60) మంగళవారం ఉపాధిహామీ పనులకు వెళ్లాడు. అనంతరం ఇంటికి వచ్చాడు. వారంలో చేసిన పనులకు కొలతలు వేసేందుకు మళ్లీ పని ప్రదేశానికి వెళ్లి తిరిగి వచ్చాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో అస్వస్థతకు గురైన చేరాలు గుండెపోటుతో మృతి చెందాడని స్థానికులు తెలిపారు.

### శ్మశాన వాటికలో ఇబ్బందులు

కరీమాబాద్, మే 27: శ్మశాన వాటికలోని బర్నింగ్ ప్లాట్‌ఫాంపై కప్పు లేకపోవంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉర్సు గుట్ట వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలో రెండు బర్నింగ్ ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. వాటి పై కప్పు నిర్మాణం చేయకపోవడంతో బాధితులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం సమయంలో దహన సంస్కారాలు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి బర్నింగ్ ప్లాట్‌ఫాంపై కప్పు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



పైకప్పు లేకుండా ఉన్న బర్నింగ్ ప్లాట్‌ఫాం

# నకిలీ విత్తన విక్రయాలపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తనాలనే విక్రయించాలి
- రైతులకు అధిక ధరకు అమ్మితే ఉపేక్షించం
- తనిఖీల్లో కలెక్టర్ సత్యశారద

నల్లబెల్లి/గీసుగొండ, మే 27: నకిలీ విత్తన విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ సత్యశారద అన్నారు. నర్సంపేట పట్టణంలోని ఫర్టిలైజర్స్‌తోపాటు ఆగ్రోస్ దుకాణాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. అలాగే, స్టాక్ రిజిస్టర్లు, రసీదు పుస్తకాలు, ధరల పట్టిక, తూకం యంత్రాలను తనిఖీ చేశారు. వానకాలం సీజన్ ప్రారంభం అయిందని, ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలనే రైతులకు విక్రయించాలని డీలర్లకు సూచించారు. అధిక ధరకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్నదాతలు నకిలీ ముఠాల చేతుల్లో మోసపోవద్దని సూచించారు. జిల్లావ్యాప్తంగా పోలీస్ శాఖ, టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ శాఖ టీంలు నకిలీ విత్తన విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ఫర్టిలైజర్స్ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో డీఏవో అనురాధ, ఏడీఏ దామోదర్, నర్సంపేట ఏవో కృష్ణ పాల్గొన్నారు. అలాగే, కలెక్టర్ గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట ఇండస్ట్రీయల్ ఏరియాలోని రాశి సీడ్స్ కంపెనీ గోడౌన్స్, స్టోరేజ్ పాయింట్లను పరిశీలించారు. విత్తనాలను అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు విధిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. నిర్వాహకులు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలన్నారు. తనిఖీల్లో సివిల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, తహసీల్దార్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.



నల్లబెల్లి: నర్సంపేట పట్టణంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సత్యశారద

### భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

పోచమ్మమైదాన్: భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో లైసెన్స్ సర్వేయర్లకు సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో 315 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు 50 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులైన వారినే సర్వేయర్లుగా నియమిస్తామని తెలిపారు. అనంతరం శిక్షణ పొందుతున్న సర్వేయర్లకు కలెక్టర్ శిక్షణ మెటీరియల్స్ కిట్లు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి దేవరాజు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, తహసీల్దార్ ఎండీ ఇక్బాల్, పర్యవేక్షకులు అబ్దుల్లా, డిప్యూటీ సర్వేయర్ ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

### హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

ఖిలావరంగల్: పునఃప్రారంభానికి ముందే హాస్టళ్లు, గురుకులాల్లో కొత్తదనం సంతరించుకునేలా మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వెల్ఫేర్ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనపై ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్లతో ఆమె సమీక్షించారు. హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు సురక్షితంగా, ఆరోగ్యంగా, గౌరవప్రదంగా జీవించేలా సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే నెల 12న పాఠశాలలు పునఃప్రారంభానికంటే ముందే విద్యార్థులకు యూనిఫాం పంపిణీకి సిద్ధంగా ఉంచాలన్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వాటర్ ట్యాంక్‌లు, మురుగునీటి కాల్వలను శుభ్రం చేయాలన్నారు. అలాగే, హాస్టళ్లలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి మునగ, పొనగంటి, కరివేపాకు తదితర మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హాస్టళ్లలో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి హెల్త్ కార్డులు ఇస్తూ నెలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. ఆరోగ్య పరిస్థితులను పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో తెలియజేయాలని సూచించారు.

### కలెక్టర్‌ను కలిసిన మాల్దీవ్స్ రిపబ్లిక్ అధికారులు

అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా వరంగల్ పర్యటనకు వచ్చిన మాల్దీవ్స్ రిపబ్లిక్ అధికారుల బృందం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు, చారిత్రక నేపథ్యం, ప్రభుత్వ విద్యాసంస్థలు, గ్రామీణ అభివృద్ధిపై కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో మాల్దీవ్స్ డైరెక్టర్ జనరల్ ఆడం షరీఫ్ అహ్మద్, డైరెక్టర్ అబ్దుల్లా రషీద్‌తోపాటు జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీవో కౌసల్యాదేవి డీపీవో కల్పన, జిల్లా అడిట్ అధికారి దేవేందర్ పాల్గొన్నారు.

## పెద్దనాన్న దూషించడంతో పురుగుల మందు తాగిన యువకుడు

**పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి తల్లి ఫిర్యాదు**

సంగెం, మే 27: నువ్వు చస్తేనే భూ సమస్య పరిష్కారం అవుతుందని పెద్ద మనుషుల సమక్షంలోనే పెద్దనాన్న, చిన్ననాన్న దూషించడంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని ఎల్గూర్‌స్టేషన్‌కు చెందిన గుగులోత్ వీరు, తిరుపతి, వెంకటేశ్వర్లు అన్నదమ్ములు. ఇందులో తిరుపతి మృతి చెందాడు. అతడికి భార్య విజయ, కుమారుడు గోపి ఉన్నారు. తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన భూమి పంపకంలో ముగ్గురు అన్నదమ్ముల మధ్య గొడవ జరుగుతున్నది. ఈ నెల 25న పెద్ద మనుషుల వద్దకు గుగులోత్ విజయను బావ వీరూ, మరిది వెంకటేశ్వర్లు పిలిపించారు. విజయ తన కుమారుడి గోపితో కలిసి పెద్దమనుషుల వద్దకు వచ్చింది. అయితే, నువ్వు చస్తేనే భూమి పంచాయితీ తెగుతుందని వీరూ, వెంకటేశ్వర్లు కలిసి గోపిని దూషించారు. మనస్తాపానికి గురైన గోపి వెంటనే ఇంటికి వెళ్లి పురుగుల మందు తీసుకొచ్చి అందరి సమక్షంలో తాగాడు. వెంటనే గోపిని దవాఖానకు తరలించారు. ఈ మేరకు మంగళవారం విజయ పోలీస్టేషన్‌కు వెళ్లి వీరూ, వెంకటేశ్వర్లుపై ఫిర్యాదు చేసింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

### విద్యుదాఘాతంతో రైతు మృతి


చెన్నారావుపేట, మే 27: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని కల్‌నాయక్‌తండాలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన రైతు గుగులోత్ భద్రూ(50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ బావి వద్ద మోటరు రిపేరు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి బావిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య వీరమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్సై చిలువేరు రోహిత్ తెలిపారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శోభన్‌బాబు

### తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కరీమాబాద్/పోచమ్మమైదాన్, మే 27: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 31న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సంబురాల వాల్ పోస్టర్‌ను జిల్లా రవాణా శాఖ ఇన్‌చార్జి అధికారి శోభన్‌బాబు మంగళవారం రంగశాయిపేటలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మిట్ట నవనీత్, నీలం శివ, బండి రవి, వెలిశాల పూర్ణచందర్, అమీర్, హరినాథ్, బండెల కృష్ణ, రాజేశ్, భాస్కర్ పాల్గొన్నారు. అలాగే, జర్నలిస్టు ఫోరం రజతోత్సవ సంబురాల వాల్ పోస్టర్‌ను వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు బండి రవి, వెలిశాల పూర్ణచందర్, కంది భరత్, ఉపాధ్యక్షుడు అమీర్, సభ్యులు హరినాథ్, బండెల కృష్ణ, రాజేశ్, భాస్కర్ పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వర్ధన్నపేట/చెన్నారావుపేట, మే 27: సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకొని, అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట ఎస్సై సూచించారు. మండలకేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం యువకులతో ర్యాలీ నిర్వహించారు. ఎవరికీ ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పొద్దన్నారు. మోసానికి గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే, చెన్నారావుపేటలో స్నేహ సంఘాలు నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై రాజేశ్‌రెడ్డి పాల్గొని సైబర్ మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్నేహ మానిటరింగ్ సభ్యురాలు జోష్, జిల్లా అధికారులు అశోక్, మండల అధికారి ఈశ్వర్, సీసీలు, ఈవోఏలు పాల్గొన్నారు.

# బాధితుడి ప్రాణాలతో చెలగాటం

- చావు చివరి అంచుల వరకు వెళ్లొచ్చిన వైనం
- చర్యలు చేపట్టిన మెడికల్ కౌన్సిల్ సభ్యులు
- ఆర్‌ఎంపీపై కేసు నమోదు



పోలీసుల అదుపులో ఉన్న నకిలీ ఆర్‌ఎంపీ మోహన్

నెక్కొండ, మే 27: బాధితుల ఫిర్యాదు మేరకు నకిలీ ఆర్‌ఎంపీపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చెరువుముందరి తండాకు చెందిన నకిలీ ఆర్‌ఎంపీ బర్మావత్ మోహన్ చేసిన వైద్యం వికటించి తన భర్త అజ్మీరా తులస్య చావు చివరి అంచుల వరకు వెళ్లాడని భార్య బుజ్జి తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సభ్యులు, పోలీసులు మంగళవారం నెక్కొండ మండలంలో తనిఖీలు నిర్వహించారు. టీజీఎంపీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్‌కుమార్, జిల్లా హెచ్‌ఆర్‌డీఏ అధ్యక్షుడు, ఐఎంఏ యాంటీ ఎంక్వైరీ కమిటీ కార్యదర్శి డాక్టర్ కె.వెంకటస్వామి, డాక్టర్ టి.నవీన్, నెక్కొండ ఎస్సై మహేందర్ నెక్కొండ, సూరిపల్లి, చెరువు ముందరితండాలో ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌ల్లో తనిఖీలు చేపట్టారు. బర్మావత్ మోహన్ అర్హత లేకున్నా డాక్టర్ అవతారమెత్తి వైద్యం చేసి బాధితుడి ప్రాణాలతో చెలగాటమాడినట్లు గుర్తించారు. అజ్మీరా తులస్య ఒంటి నొప్పులతో గత నెల 7న చిన్నకోర్పోలులో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహిస్తున్న బర్మావత్ మోహన్ వద్దకు వెళ్లాడు. బాధితుడి తొంటికి ఇంజిక్షన్ ఇవ్వగా, అది గడ్డకట్టి తులస్యకు జ్వరం వచ్చింది. బాధితుడు మరోసారి వెళ్లగా మళ్లీ ఇంజిక్షన్లు ఇచ్చి సెలైన్ బాటిళ్లు పెట్టాడు. దీంతో అతడి ఆరోగ్యం క్షీణించింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు 12న తులస్యను నర్సంపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. అతడికి రెండుసార్లు ఆపరేషన్ నిర్వహించి తొంటి, తొడ, కాలికి సోకిన ఇన్ఫెక్షన్లను తొలగించారు. తర్వాత అతడి ఆరోగ్యం కుదుట పడింది. నకిలీ ఆర్‌ఎంపీ చేసిన వైద్యంతో బాధితుడు నరకం చూసాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. నకిలీ వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు స్పష్టం చేశారు.

# పెండింగ్ బిల్లులపై బోగస్ ప్రచారం తగదు



పోలీసులు అరెస్ట్ చేసిన మాదాసు రవి

నెక్కొండ, మే 27: మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల చెల్లింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బోగస్ ప్రచారం చేయడం తగదని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మాదాసు రవి అన్నారు. మండలంలోని అలంకానిపేటకు చెందిన మాదాసు రవిని నెక్కొండ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదవగౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతుంటే ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేయించడం తగదన్నారు. ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ పనులు చేసిన కాంట్రాక్టర్లకే బిల్లులు చెల్లించిందని, ఆ బిల్లుల్లోనూ అధికార పార్టీ వారే ఉన్నట్లు ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## 'దేశ సార్వభౌమత్వానికి పొంచి ఉన్న ప్రమాదం'

వరంగల్‌చౌరస్తా, మే 27: కేంద్రం విధానాల వల్ల దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం పొంచి ఉందని ఎంసీపీఐ(యూ) అఖిలభారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో రాజస్థాన్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ మహేందర్ నేహా అధ్యక్షతన మంగళవారం పొలిట్‌బ్యూరో సమావేశం నిర్వహించారు. ముందుగా పెహల్గామ్ మృతులు, ఆపరేషన్ సిందూర్‌లో మృతి చెందిన జవాన్లకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రజా పోరాటాల ద్వారా కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కమ్యూనిస్టులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు కిరణ్‌జిత్ సింగ్ షెకాన్, గాదగోని రవి, అనుభవ్‌దాస్ శాస్త్రి, పల్లెపు ఉపేందర్‌రెడ్డి, కాటం నాగభూషణం పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మద్దికాయల అశోక్




ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు

### ఘనంగా తిరంగా ర్యాలీ

వర్ధన్నపేట, మే 27: పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ పేరుతో యుద్ధం చేసి విజయం సాధించిన భారత్ సైనికులకు మద్దతుగా మంగళవారం వర్ధన్నపేటలో తిరంగ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, అరూరి రమేశ్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ హాజరై జాతీయ పతాకాలను చేతబూని పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కొత్తపల్లిస్టాండ్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా భారత మాత, సైనికులకు మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, నాయకులు కుసుమ సతీశ్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ విజయ్‌కుమార్, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




పోచమ్మమైదాన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

### రైతాంగ పోరాటాలను ఉధృతం చేస్తాం

**ఏఐకేఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి**

పోచమ్మమైదాన్, మే 27: కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై రైతాంగ పోరాటాలను ఉధృతం చేస్తామని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్(ఏఐకేఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడు మర్రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శివనగర్‌లో జరుగుతున్న ఎంసీపీఐ రాష్ట్ర ప్రథమ మహాసభల సందర్భంగా పోచమ్మమైదాన్ సెంటర్‌లో భారీ రైతు ర్యాలీ, ప్రదర్శనను మంగళవారం ఆయన ప్రారంభించారు. కేంద్రం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రుణమాఫీలను ఎత్తేసే కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. కేంద్ర సర్కారు కేవలం కార్పొరేట్ కంపెనీలకు తొత్తుగా పనిచేసేందుకు కుట్రలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. ర్యాలీలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు, నాయకులు చంద్రశేఖర్, సింగని సాంబయ్య, పానుగంటి నర్సయ్య, బాషిపాక రమేశ్, కుస సపంత్, బల్సుకూరి నర్సయ్య, వీరమల్లు, రాజు, తిరుపతి, రాజేశ్‌నాయక్ పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి

### మహిళలు ఆర్థికంగా ఎదగాలి : దొంతి

ఖానాపురం, మే 27: ప్రభుత్వం అందిస్తున్న చేయూతను వినియోగించుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో చైతన్య మండలి సమాఖ్య వార్షిక మహాసభ మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దొంతి మాట్లాడుతూ మహిళలు బ్యాంకు రుణాలను వినియోగించుకొని వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం చైతన్య మండల సమాఖ్యకు రూ. 10.20 కోట్ల రుణ చెక్కును దొంతి అందజేశారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ హరిబాబు, ఏపీడీ రేణుకాదేవి, డీపీఎంలు అనిత, వేణు, సమాఖ్య అధ్యక్షురాలు కవిత, జ్యోతి, కృష్ణకుమారి, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.



32వ డివిజన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

### సమస్యలమయంగా కాలనీలు

కరీమాబాద్, మే 27: వరంగల్ నగరంలోని పలు డివిజన్‌ల్లో కాలనీలు సమస్యలకు కేరాఫ్‌గా ఉన్నాయని సీపీఎం నాయకులు అన్నారు. 32వ డివిజన్‌లోని కాలనీల్లో మంగళవారం సీపీఎం నాయకులు సర్వే చేశారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి సింగారపు బాబు మాట్లాడుతూ 32వ డివిజన్‌లోని కాలనీల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. బీరన్నకుంటలోని వెయ్యి గజాల స్థలంలో పేదల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలన్నారు. ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించుకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గున్నాల ప్రభాకర్, ఉపేందర్, అప్పాజీ, వాణి, రమ్య పాల్గొన్నారు.

### ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

గిర్మాజీపేట, మే 27: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ఇంటర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు ఫస్టియర్‌లో 1899 మందికి 1784 విద్యార్థులు హాజరై 115 గైర్హాజరయ్యారు. సెకండియర్‌లో 689 విద్యార్థులకు 655 హాజరు కాగా, 34 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో జ్ఞానేశ్వర్ తెలిపారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఐఈవో పేర్కొన్నారు.

# జిల్లాలో భారీ వర్షం

### తిలక్‌రోడ్డులో ఇళ్లల్లోకి చేరిన మురుగునీరు

పోచమ్మమైదాన్/నల్లబెల్లి, మే 27: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వరంగల్ 21వ డివిజన్ తిలక్‌రోడ్డు వర్షపు నీటితో నిండిపోయింది. డ్రైనేజీ నీటితోపాటు వర్షపు నీళ్లు ఇళ్లల్లోకి చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. దుర్వాసనతో కూడిన నీళ్లు రావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. అలాగే, నర్సంపేట రోడ్డు నుంచి రవాణా సౌకర్యాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కార్లు, ద్విచక్ర వాహనాలు వాననీటిలో మునిగిపోయాయి. గంటపాటు స్థానికులకు ఇక్కట్లు తప్పలేదు. తిలక్‌రోడ్డు అసోసియేషన్ అధ్యక్షుడు లక్కిరెడ్డి పూర్ణేందర్‌రెడ్డి, గుండెకారి జగన్ వర్షపు నీటిని పర్యవేక్షించారు. ఈ ప్రాంతంలో బల్దియా అధికారులు శాశ్వత చర్యలు చేపడితేనే ఇబ్బందులు తొలగుతాయని వారు అభిప్రాయపడ్డారు. అలాగే, నల్లబెల్లి మండలంలో అరగంటపాటు మోస్తరు వర్షం కురిసింది. రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. సాగుకు సన్నద్ధమవుతున్నారు.



వర్షపు నీటితో నిండిన తిలక్‌రోడ్డు



నల్లబెల్లి: మండలకేంద్రంలో కురుస్తున్న వర్షం

### జిల్లాలో సాధారణ వర్షపాతం

ఖిలావరంగల్: జిల్లాలో మంగళవారం తేలికపాటి జల్లుల నుంచి సాధారణ వర్షపాతం నమోదైంది. ఖిలావరంగల్‌లో 64.0 మిల్లీ మీటర్లు, కాశీబుగ్గలో 62.5, గీసుగొండ మండలం గొర్రెకుంటలో 54.0, గీసుగొండలో 25.0, దుగ్గొండిలో 51.5, నర్సంపేటలో 41.3, పైడిపల్లిలో 37.5, నల్లబెల్లిలో 36.5, చెన్నారావుపేటలో 29.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.